# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 036
పేజీలు : 10 | వెల: రూ.5/-
బుధవారం
జనవరి 14, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




పాఠకులకు, ప్రకటన కర్తలకు, జర్నలిస్టు మిత్రులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు మరియు మహిళామణులకు **బోగి, సంక్రాంతి మరియు కనుమ** పండుగల శుభాకాంక్షలు.. పండుగ సందర్భంగా గురువారం కార్యాలయానికి సెలవు. పున: దర్శనం శుక్రవారం.

ఇట్లు : మేనేజ్ మెంట్, వరంగల్ వాయిస్



# 18న మేడారానికి సీఎం

- పాల్గొననున్న రాష్ట్ర మంత్రులు
- భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- 19న ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం
- సన్నాహాల్లో జిల్లా యంత్రాంగం
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, మేడారం :** ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు మేడారం రానున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం మేడారం హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 18వ తేదీన రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొత్తం మేడారంలోనే బసచేయనున్నందున ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని (మిగితా 2లో...)







## భక్తుల విశ్వాసానికి ప్రతీక

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన







# 18న మేడారానికి సీఎం








**(మొదటి పేజీ తరువాయి..)**
అధికారులను కోరారు. 18వ తేదీ ఆదివారం కావడం, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఆ దృష్టితో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. 19వ తేదీన శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనులను సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. మేడారం అభివృద్ధి పనుల్లో సహకరిస్తున్న జిల్లా అధికారులు, వారి బృందాలకు, జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.
ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రోటోకాల్, బందోబస్తు, వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్ నిర్వహణ పనులను ఆర్ అండ్ బీ శాఖకు అప్పగించారు. మేడారం జాతరతో పాటు గద్దెల ప్రాంగణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓను ఆదేశించారు. ముఖ్యమంత్రి, వీఐపీ ప్రోటోకాల్ బాధ్యతలను ఆర్డీఓ వెంకటేష్ కు అప్పగించారు. ముఖ్యమంత్రి నిర్వహించనున్న బహిరంగ సభకు జిల్లాలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అలాగే ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ధింసా, కోయ, గుస్సాడి, కొమ్ము కోయ తదితర సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రత, రూట్ మ్యాప్, పార్కింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ..

మేడారం జాతర కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర మంత్రి సీతక్క చేతులమీదుగా బుధవారం మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మేడారం శాశ్వత అభివృద్ధి కోసం ప్రభుత్వం కోరగానే స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూములు ఇచ్చిన రైతులను తాము ఎప్పటికీ గుర్తుంచుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్ర, ఆర్డీఓ వెంకటేష్, భూములు కోల్పోయిన రైతులు, పూజారులు, ఆదివాసీ సంఘాలు, మేడారం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.










# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

■ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**వరంగల్ వాయిస్, శాయంపేట:** పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాలకు పేద కుటుంబాలు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన 57 మంది లబ్ధిదారులకు రూ. 57,06,612 విలువైన చెక్కులను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన 32 మంది బాధితులకు రూ. 10,50,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. సామాజిక సమానత్వం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు, మండల ప్రజల సౌకర్యార్థం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. దీనివల్ల స్థానికులు ఆధార్ సేవలకు దూరం వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి చంద్ర, తహసిల్దార్, మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్, వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, అధికార ప్రతినిధి చిందం రవి, ఎన్ ఎస్ ఆర్ సంస్థల అధినేత సంపత్ రావు, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, సర్పంచ్ చింతల ఉమా రైపాల్, గజ్జి ఐలయ్య, వైనాల కుమారస్వామి, చిట్టి రెడ్డి జంగారెడ్డి, వరదరాజు, చిరంజీవి, భాషని శాంతా రవి, రేణిగుంట్ల సదయ్య, బాసని మార్కండేయ, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** అనారోగ్యంతో అచేతన స్థితికి చేరుకుని, గత కొన్ని నెలలుగా మంచానికే పరిమితమైన బొడ్డు ఆత్మలింగం అనే వ్యక్తికి వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మానవతా దృక్పథంతో అండగా నిలిచింది. ట్రస్ట్ తరపున బాధితుడికి రూ.2,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఆత్మలింగం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, ఆయన భార్యాపిల్లలు ఎంతో ఓపికతో సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఆత్మలింగం త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నేటి కాలంలో పిల్లలు తమ తల్లిదండ్రులను ప్రేమతో, ఆప్యాయంగా పలకరించడం వల్ల వారిలో మానసిక ఉత్తేజం కలుగుతుందని, అదే వారికి సగం ఆరోగ్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, అనారోగ్యంతో బాధపడుతున్న ఇటువంటి నిస్సహాయులను ఆదుకోవడానికి మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి, సభ్యులు మట్టపల్లి సమ్మయ్య, రామ శ్రీనివాస్, బాధితుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్వతగిరి మండలంలోని అన్నారం గ్రామంలో పండుగ సందడి నెలకొంది. స్థానిక గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మహిళలు, యువతుల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో మహిళలు పోటీపడి రంగురంగుల ముగ్గులు వేసి తమ సృజనాత్మకతను చాటారు. గొబ్బెమ్మలు, హరిదాసుల ఆకృతులతో ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు పాలకవర్గం నగదు బహుమతులను అందజేసింది. ఉమ్మగాని సాంబలక్ష్మి రూ.2016, దొంతమాల మౌనిక రూ.1116, తృతీయ బహుమతి రూ.516 వీరితో పాటు ప్రతిభ కనబరిచిన మరికొందరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేసినందుకు సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ గొడుగు యాకాంత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ‘చలో ఖమ్మం’ను జయప్రదం చేయండి

◆ 18న ముగింపు ఉత్సవాల బహిరంగ సభ

◆ గోడపత్రికల విడుదల




**వరంగల్ వాయిస్, కాజీపేట:** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల అఖిల భారత స్థాయి ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరగబోయే భారీ బహిరంగ సభను లక్షలాది మందితో జయప్రదం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పిలుపునిచ్చారు. కాజీపేట మండలంలోని మడికొండ మెయిన్ రోడ్ సెంటర్ నందు, మండల కార్యదర్శి మాలోత్ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శత వసంతాల ముగింపు ఉత్సవాల గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తికై నిరంకుశ నిజాంను గద్దె దించిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర సీపీఐది అని కొనియాడారు. నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో 3,000 గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చేముందు ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు ఇస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికిన బీజేపీ ప్రభుత్వం, నేడు ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న నినాదం అటకెక్కిందని మండిపడ్డారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా వామపక్ష, ప్రజాతంత్ర, పురోగామి శక్తులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రక శత వసంతాల ముగింపు సభకు రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు మరియు అన్ని రంగాల కార్మిక వర్గాలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, మండల సహాయ కార్యదర్శి కుడి స్వామి, జిల్లా సమితి సభ్యురాలు రాసమల్ల దీన, భుఖ్య స్వరూప, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాసమల్ల కుమార్, సాలకుల సరూప, గుగులోతు రమేష్, మునిగాల స్వామి, భైరపాక జార్జ్, గుండె నాగరాజు, సంకేమనమ్మ, చేపూరి ప్రమీల, లకావత్ నరసింహ లక్ష్మి, బీకేఎంయూ రాష్ట్ర సమితి సభ్యురాలు రాజమణి, బానోత్ మానెమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రాంతీయ ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ, వారి గొంతుకగా నిలుస్తున్న ‘వరంగల్ వాయిస్’ సాయంత్రం డైలీ దినపత్రిక యాజమాన్యం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పలువురు ప్రముఖులు ఘనంగా ఆవిష్కరించారు. హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్తా ప్రసారంలో నిజాయితీని పాటించాలని, సామాజిక బాధ్యతతో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగించాలని పత్రిక యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో అమృత చిల్డ్రన్స్ హాస్పిటల్ యజమాని డాక్టర్ గుండేటి రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తోపుచెర్ల వేణుగోపాల్ రావు కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పత్రికలు సమాజానికి దిక్సూచిలా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ‘వరంగల్ వాయిస్’ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, దామెర రిపోర్టర్ ఉస్నగిరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



## పరకాలలో తప్పిన పెను ప్రమాదం

ఫ్రిడ్జ్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

సంజయ్ గ్లాస్ అధినేత ఇంట్లో అగ్నిప్రమాదం

సుమారు రూ. 15 లక్షల ఆస్తి నష్టం



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో మంగళవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం తప్పింది. స్థానిక సంజయ్ గ్లాస్ మార్ట్ యజమాని గోరంటల సంజయ్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గోరంటల సంజయ్ తన కుటుంబంతో కలిసి వేములవాడ జాతరకు వెళ్లారు. మంగళవారం రాత్రి వారు తిరిగి వచ్చి ఇంటి తలుపులు తీయగానే, లోపలి నుంచి దట్టమైన పొగలు వెలువడడాన్ని గమనించారు. ఇంట్లో మంటలు వ్యాపిస్తున్నాయని గుర్తించిన సంజయ్, వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వంటగదిలోని ఫ్రిడ్జ్ షార్ట్ సర్క్యూట్ కావడంతోనే మంటలు మొదలైనట్లు అధికారులు నిర్ధారించారు. మంటలు మరింత విస్తరించకుండా వెంటనే కరెంట్ కనెక్షన్‌ను నిలిపివేసి, వంటగదిలో ఉన్న గ్యాస్ సిలిండర్లను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వంటగదిలో గ్యాస్ సిలిండర్లు ఉన్న సమయంలోనే మంటలు చెలరేగడం గమనార్హం. ఒకవేళ సంజయ్ కుటుంబం జాతర నుంచి సకాలంలో ఇంటికి చేరుకోకపోయినా, లేదా మంటలు సిలిండర్లకు వ్యాపించినా భారీ పేలుడు సంభవించి ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని బాధితులు కోరుతున్నారు.

# వరంగల్ ఐక్యత చారిత్రక అవసరం




తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పుడు పది జిల్లాలతో మన ప్రస్థానం మొదలైంది. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల విభజన అవసరమే అయినప్పటికీ, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు శాస్త్రీయతకు దూరంగా, రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా సాగాయన్నది నగ్నసత్యం. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామం. గతంలో రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు లేని కాలంలోనే కలెక్టర్లు అతిపెద్ద జిల్లాలను సమర్థవంతంగా పర్యవేక్షించేవారు. నేడు ఇంటర్నెట్, డిజిటల్ గవర్నెన్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా 33 జిల్లాల ఏర్పాటు వెనుక హేతుబద్ధత కనిపించడం లేదు. వాస్తవానికి 18 నుంచి 20 జిల్లాలు ఉంటే పరిపాలన ఎంతో సులభంగా ఉండేది. కానీ, అప్పటి ప్రభుత్వం కేవలం సెంటిమెంట్లు, రాజకీయ స్వలాభం కోసమే జిల్లాల సంఖ్యను పెంచిందనే విమర్శలు ఉన్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు పేరుతో జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం, భారీ బడ్జెట్ కేటాయింపులు ఎవరి ప్రయోజనాల కోసం అన్నది బహిరంగ రహస్యం.

## వరంగల్ అస్తిత్వంపై దెబ్బ..

ప్రధానంగా చారిత్రక వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయడం ఇక్కడి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఒకే నగరాన్ని హనుమకొండ, వరంగల్ అని రెండు జిల్లాలుగా విడగొట్టడం వల్ల వరంగల్ తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. నగరాన్ని విడగొట్టకుండా 'ఏకీకృత వరంగల్'గా ఉంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా ఎదగాల్సిన వరంగల్ అభివృద్ధికి ఈ విభజన అడ్డంకిగా మారింది. కరీంనగర్ వంటి ఉమ్మడి జిల్లాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

## 'ఒకే నగరం – ఒకే జిల్లా'తోనే సమగ్ర అభివృద్ధి..

చారిత్రక వైభవానికి, కాకతీయుల కళా ప్రతిభకు నిలువుటద్దం మన వరంగల్. దక్షిణ భారత దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ నగరాన్ని గత పాలకులు రాజకీయ చదరంగంలో పావుగా మార్చి, ముక్కలు ముక్కలుగా విభజించడం అత్యంత విచారకరం. వరంగల్ కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు, అది కోట్లాది మంది తెలంగాణ ప్రజల సెంటిమెంట్. అటువంటి నగరాన్ని హనుమకొండ, వరంగల్ అని రెండు జిల్లాలుగా విడగొట్టడం వల్ల ఇటు పరిపాలనలో గందరగోళం, అటు అభివృద్ధిలో కుంటుబాటు కనిపిస్తోంది. ఒకే నగరం.. ఒకే మున్సిపల్ కార్పొరేషన్.. కానీ రెండు జిల్లాల పాలన. ప్రస్తుతం హనుమకొండ, వరంగల్ జిల్లాల ముఖచిత్రం ఇది. దేశంలో ఎక్కడా లేని విధంగా, కేవలం 5 కిలోమీటర్ల దూరంలోనే రెండు కలెక్టరేట్లు కొలువుదీరడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది పరిపాలనా సౌలభ్యం కంటే గందరగోళానికే దారితీస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే పోలీస్ కమిషనర్ ఇద్దరు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవడం క్షేత్రస్థాయిలో సమస్యగా మారింది. వరంగల్ పేరుతో ఖ్యాతి గడించిన జాతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ (NIT), కాకతీయ విశ్వవిద్యాలయం (KU) ప్రస్తుతం భౌగోళికంగా హనుమకొండ జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఇది వరంగల్ అస్తిత్వాన్ని ప్రశ్నించేలా ఉంది.

## రెండో రాజధానిగా ఎదగాలంటే..

హైదరాబాద్ తర్వాత తెలంగాణలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్. దీనిని రాష్ట్రానికి రెండో రాజధానిగా తీర్చిదిద్దాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. అది సాకారం కావాలంటే నగరం మొత్తం ఒకే గొడుగు కింద ఉండాలి. ఐటీ హబ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, హెల్త్ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ ఒకే జిల్లా పరిధిలోకి వస్తేనే నిర్ణయాధికారం వేగంగా ఉంటుంది. రామప్ప నుంచి వేయి స్తంభాల గుడి వరకు ఉన్న పర్యాటక సర్క్యూట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలంటే ఉమ్మడి జిల్లా యంత్రాంగం అవసరం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించబోయే కొత్త కమిషన్ ముందు మా ప్రధాన డిమాండ్ ఒక్కటే. వరంగల్ , హనుమకొండ జిల్లాలను తక్షణమే విలీనం చేసి "ఏకీకృత వరంగల్ జిల్లా"గా పునరుద్ధరించాలి. నగరాన్ని విడదీసి అభివృద్ధిని అడ్డుకోవడం కంటే, నగరాన్ని కలిపి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రెండో ఇంజిన్‌గా మార్చాలి. "వరంగల్ నగరం విడిపోతే చరిత్ర క్షమించదు. నగరం ఒకటిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం. ఇదే వరంగల్ ప్రజల ఆకాంక్ష."

## ప్రభుత్వానికి విజ్ఞప్తి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కమిషన్ కేవలం నామమాత్రంగా ఉండకూడదు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అభిప్రాయాలను, శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మండలాల నుంచి జిల్లాల వరకు ప్రతి యూనిట్‌ను ప్రజావసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించాలి. హనుమకొండ మరియు వరంగల్ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా మార్చడం ద్వారా వరంగల్ ఖ్యాతిని కాపాడాలి. రాజకీయ అవసరాల కోసం కాకుండా, భౌగోళిక,ు పరిపాలన సౌలభ్యం ఆధారంగా జిల్లాలు ఉండాలి. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ కొత్త కమిషన్ ద్వారా జిల్లాల సరిహద్దులను సరిదిద్ది, నిజమైన ప్రజల అవసరాలను తీర్చాలి.



వ్యాసకర్త
అల్లం మల్లికార్జునరావు, (రిటైర్డ్ హెచ్‌ఎం)
ఫోన్ : 99894 17618

# పీవీ వంశస్థుల 'శతాధిక రథోత్సవం'

- వంగరలో వైభవంగా ప్రారంభం
- కొత్తకొండకు వీరభద్రుని రథయాత్ర
- 1926లో ప్రారంభమైన మొక్కు..
- నేటికీ కొనసాగిస్తున్న మాజీ ప్రధాని కుటుంబీకులు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి/వంగర:** భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ.నరసింహారావు స్వస్థలమైన వంగర గ్రామంలో గురువారం ఒక అరుదైన చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. పీవీ.వంశస్థులు గత 100 ఏళ్లుగా జరుపుతున్న శ్రీ వీరభద్ర రథోత్సవం వంగర నుంచి కొత్తకొండ వరకు అత్యంత వైభవంగా సాగనుంది. శివసత్తుల పూనకాలు, డోలు విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాల మధ్య ఈ శతాధిక రథోత్సవం జరగనుంది. ఈ రథోత్సవం వెనుక ఒక ఆసక్తికరమైన కుటుంబ గాథ ఉంది. వంగర గ్రామానికి చెందిన ప్రముఖ భూస్వామి పాములపర్తి వెంకట రంగారావు, రత్తమ్మ దంపతులకు మగ సంతానం లేకపోవడంతో వారు కొత్తకొండ వీరభద్ర స్వామిని మొక్కుకున్నారు. తమకు మగ బిడ్డ దొరికితే ప్రతి ఏటా వంగర నుంచి కొత్తకొండ వరకు రథోత్సవం నిర్వహిస్తామని మొక్కుకున్నారు. ఆ మొక్కు ఫలితంగానే దాయాదుల కుటుంబానికి చెందిన పీవీ.నరసింహారావును వారు దత్తత తీసుకున్నారు. స్వామివారి చలువ వల్లే పీవీ.తమ ఇంటికి వచ్చారని భావించిన ఆ దంపతులు 1926లో ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. గతంలో పీవీ.నరసింహారావు, ఆ తర్వాత ఆయన కుమారులు రాజేశ్వరరావు, ప్రస్తుతం ప్రభాకర్ రావు ఈ బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఒకప్పుడు మూడు అంతస్తుల కలప రథాన్ని ఆరు జతల ఎద్దులతో లాగేవారు. ప్రస్తుతం విద్యుత్ తీగల కారణంగా ఒకే అంతస్తుకు కుదించి, రెండు జతల ఎద్దులతో నిర్వహిస్తున్నారు. దారి పొడవునా భక్తులు గుమ్మడికాయలు, బెల్లం, బియ్యం స్వామివారికి మొక్కులుగా సమర్పిస్తారు. ఎద్దులకు జలాభిషేకం చేయడం ఇక్కడి ఆచారం. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ.ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న తమ వంశ ఆచారాన్ని భావితరాలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పీవీ.మ్యూజియం ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే ఈ రథోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ వేడుకను విజయవంతం చేయడానికి సర్పంచ్ సృజన రమేష్, ఉప సర్పంచ్ రమేష్, గ్రామ యువత శ్రమిస్తున్నారు.

# జర్నలిస్టుల అరెస్టు అప్రజాస్వామికం

- స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ధ్వజం



**వరంగల్ వాయిస్, మల్హార్/భూపాలపల్లి:** సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్, చారి, సుధీర్‌లను పోలీసులు అరెస్టు చేయడాన్ని స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్జేయూ–ఎన్యూజే–ఐ) తీవ్రంగా ఖండించింది. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ పాల్గొని మాట్లాడారు. ఈ అరెస్టులు మీడియా స్వేచ్ఛను పూర్తిగా హరించే చర్యలని వారు మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినా, అధికార పక్ష నేతల మీద కథనాలు రాసినా జైలుకు పంపుతామనే సంకేతాన్ని ఈ ప్రభుత్వం ఇస్తోందని వారు ఆరోపించారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు వాటిలోని నిజానిజాలపై విచారణ జరపాలి కానీ, వార్త రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యంలో సమంజసం కాదని పేర్కొన్నారు. వ్యక్తిగత ఫిర్యాదులు లేకపోయినా, కేసులో పేర్లు లేకపోయినా కేవలం ఒక సంఘం ఇచ్చిన ఫిర్యాదుతో అరెస్టు చేయడం భయపెట్టే ప్రయత్నమేనని ధ్వజమెత్తారు. మంత్రులు, అధికారులపై ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి తప్ప, జర్నలిస్టులను వేధించడం సరికాదని హితవు పలికారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛపై దాడులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున జర్నలిస్ట్ ఉద్యమం చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్, సంయుక్త కార్యదర్శులు కడపాక రవి, పల్నాటి రాజు, మారెపల్లి చంద్రమౌళి, భూపాల్, జగన్, కారుకూరి సతీష్, హేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దూడెల మల్లికార్జున స్వామి జాతర

- నేటి నుంచే ప్రారంభం..
- 15, 16 తేదీల్లో పట్నాలు, బోనాల సమర్పణ
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పర్వతగిరి మండలంలోని గోపనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దూడెల మల్లికార్జున స్వామి జాతర సంక్రాంతి పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. ఈ జాతరకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతరకు భక్తులు సంప్రదాయబద్ధంగా తమ ఎడ్ల బండ్లపై తరలిరావడం ఇక్కడి ప్రత్యేకత. పర్వతగిరితో పాటు సంగెం, గీసుకొండ, నెక్కొండ, అయినవోలు, వర్ధన్నపేట, నర్సంపేట మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భోగి రోజు సాయంత్రం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఈ నెల 15, 16 తేదీల్లో స్వామివారికి పట్నాలు వేసి, బోనం నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పిస్తారని అర్చకులు వివరించారు. ప్రస్తుతం ఆలయ కమిటీ లేనప్పటికీ, లడ్డూలు, పులిహోర, కొబ్బరిచిప్పల టెండర్లు మరియు టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయంతో జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షిత మంచినీటి వసతి, స్నానఘట్టాలు, బాత్రూం వసతులు, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా భక్తులు సహకరించి, జాతరను విజయవంతం చేయాలని ఆలయ యంత్రాంగం కోరింది.

# వైభవంగా గోదా రంగనాథ స్వామి కళ్యాణం



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** నగరంలోని ప్రసిద్ధిగాంచిన కాశీబుగ్గ శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో భోగి పండుగ సంబరాలు మిన్నంటాయి. పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య కళ్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఈ వేడుకను కళ్లారా వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు శాస్త్రోక్తంగా ఈ కళ్యాణాన్ని జరిపించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం మాజీ అధ్యక్షులు వంగరి రవి, మాజీ కమిటీ సభ్యులు చిలుపూరి సురేష్, సుల్తానా సమ్మక్క, కూరపాటి రోజా, మంచాల సృజన, కోల కవిత, శ్రీరాముల పుష్పలీల పాల్గొన్నారు. అలాగే వంగరి సమ్మయ్య, గడ్డం అశోక్, బొద్దుల భాస్కర్, విక్కి, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. వేడుకల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. భోగి పండుగ రోజున జరిగిన ఈ కళ్యాణ మహోత్సవంతో కాశీబుగ్గ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

## శాయంపేటలో..

**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ, శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం గోదాదేవి రంగనాయకుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సంక్రాంతి పర్వదినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి, మార్త రాజు బృందం వేదమంత్రాల మధ్య ఈ కళ్యాణాన్ని జరిపించారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధన పూజ మరియు కన్యాదానం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.కళ్యాణదాతలు, అడ్వకేట్ గట్ల విజయపాల్ రెడ్డి – సరోజన దంపతులతో పాటు దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి – రాజమణి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను, తలంబ్రాలను పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. కళ్యాణం అనంతరం ఒక ప్రత్యేక ఘట్టంగా, పెళ్లి కాని యువతీ యువకులతో స్వామివారికి తలంబ్రాలు పోయించారు. ఇలా చేయడం వల్ల వారికి త్వరగా వివాహ ఘడియలు వస్తాయని భక్తుల నమ్మకం. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జిన్నా కృపాకర్ రెడ్డి, అఖిల భారత పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య, ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.



# సంక్రాంతి మన సంస్కృతికి, రైతన్న శ్రమకు ప్రతీక

## ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు

## దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబాసి నవీన్



**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబాసి నవీన్ భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇది రైతన్నలు కష్టపడి పండించిన పంట ఇంటికి వచ్చే మహత్తర పండుగ అని, వారి శ్రమకు గౌరవం తెలిపే పర్వదినమని కొనియాడారు. భోగి: పాత ఆలోచనలను, అడ్డంకులను విడిచిపెట్టి.. కొత్త ఆశలు, ఆకాంక్షలతో జీవితంలో ముందుకు సాగాలనే సందేశాన్ని భోగి ఇస్తుందని తెలిపారు. రైతులు, శ్రామికుల విజయానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.గ్రామీణ జీవన విధానం, పశుసంపద ప్రాధాన్యతను గుర్తు చేసే పండుగగా దీనికి ప్రత్యేకత ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ సంక్రాంతి ప్రతి ఇంటికి సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యాన్ని ప్రసాదించాలని, తమ్మన్నపేట గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# బీజేపీ జిల్లా కార్యదర్శిగా బొమ్మసాని అనిల్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా బొమ్మసాని అనిల్ యాదవ్ నియమితులయ్యారు. జిల్లా పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఈ నియామకాన్ని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా కమిటీలో కీలకమైన కార్యదర్శి పదవిని అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డికి, సీనియర్ నాయకురాలు రావు పద్మకు తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. నాయకత్వ మార్గనిర్దేశనంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఆయన మాట ఇచ్చారు. ఈ నియామకం పట్ల అనిల్ యాదవ్ అనుచరులు, పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**వరంగల్ వాయిస్, గణపురం:** సంక్రాంతి పండుగ, భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపురం మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ సర్పంచ్ ఎలుకపెల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామంలో పండుగ శోభను రెట్టింపు చేశాయి. గ్రామ పరిధిలోని మహిళలు, యువతులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో వాకిళ్లను అందంగా తీర్చిదిద్ది తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని అక్కాచెల్లెమ్మలందరూ ఒకేచోట చేరి జరుపుకున్న ఈ వేడుక సామాజిక ఐక్యతకు వేదికగా నిలిచింది. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి కాసర్ల మౌనిక రూ.5,016, ద్వితీయ బహుమతి ఎలుకపెల్లి కళ్యాణి రూ. 1,016, తృతీయ బహుమతి తొట్ల అఖిల రూ.516 లు గెలుచుకున్నారు. ఈ వేడుకలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్, మార్నేని ఉపేందర్ రావు, ఐలోని రామచంద్ర



రెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షులు దోమల రాజయ్య, బుల్లెడ్ల ప్రభాకర్ రెడ్డి, దోమల రవీందర్, మారేపల్లి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కొడారి రవీందర్, కొత్తగట్టు రవీందర్, కందికొండ అనిల్, వంగ మల్లేష్, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# దివ్యాంగుల మధ్య సంక్రాంతి సంబరాలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హన్మకొండలోని ప్రభుత్వ దివ్యాంగుల బాలికల ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండుగ పూట ఆశ్రమ విద్యార్థులకు 'అమ్మ ప్రేమ'ను పంచుతూ, వారికి స్వీట్లు, స్నాక్స్ పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. పండుగ అంటేనే అందరినీ కలుపుకుని ఆనందంగా జరుపుకునేదని, అటువంటి ఆనందాన్ని ఈ పిల్లల మధ్య పంచుకోవడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. "ఈ పిల్లలకు మేమంతా ఉన్నామనే భరోసా కల్పించడమే నా ఉద్దేశ్యం. దివ్యాంగులకు సేవ చేయడం దైవ సేవతో సమానం" అని ఆమె వ్యాఖ్యానించారు. విద్యార్థులకు ఒక అమ్మలా మంచి మాటలు చెబుతూ.. చదువును ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయవద్దని ఆమె సూచించారు. జీవితంలో ఒక మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, విద్యార్థులు, అనురాగ్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి సమయం గడపడం పట్ల డాక్టర్ అనితా రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 'బీఆర్ఎస్' అనుబంధ కమిటీల ఎన్నిక



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పర్వతగిరి మండలంలోని అనంతారం గ్రామంలో పార్టీని బలోపేతం చేసే దిశగా బుధవారం కీలక అడుగు పడింది. గ్రామ సర్పంచ్ శ్రీలత దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ అనుబంధ విభాగాలైన యూత్, సోషల్ మీడియా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు మేకిరి మల్లికార్జున్, ఉపసర్పంచ్ పెర్వారం రతన్ బాబు సమక్షంలో ఈ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. నూతనంగా యూత్ కమిటీ అధ్యక్షుడిగా ఘౌటి శివ, యూత్ ప్రధాన కార్యదర్శి జంజీరాల అఖిల్, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ మేకిరి అఖిల్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. చురుకైన యువతకు బాధ్యతలు అప్పగించడం వల్ల పార్టీ గ్రామంలో మరింత బలోపేతం అవుతుందని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాదారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా గీసుగొండ మండలం మొగిలిచర్ల గ్రామానికి (గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్) చెందిన సీనియర్ నాయకులు రాదారపు శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రాదారపు శివకుమార్ మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేశానని, పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా ఎదిగానని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా తనకు హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని కట్టబెట్టిన జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రావు పద్మ, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ విజయ చందర్ రెడ్డిలకు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా నాయకులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నియామకం పట్ల స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు శివకుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# మెరిసింది.. మేడారం




































# ఘనంగా శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఉర్సుగుట్టపై కొలువై ఉన్న శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణం బుధవారం భోగి పర్వదినం సందర్భంగా అంగరంగ వైభవంగా జరిగింది. ఇట్టి కల్యాణంలో అనేకమంది దంపతులు పాల్గొని కట్నకానుకలతో పాటు తలంబ్రాల బియ్యం సమర్పించారు. ప్రధాన అర్చకులు వరియోగుల భాస్కర స్వామి, హరిప్రసాద్, లక్ష్మీ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, ప్రవీణ్ ల మంత్రోచ్చారణ మధ్య జరిగిన కళ్యాణోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం దేవాలయం తరపున మహా అన్నదానం నిర్వహించారు. రూ.2 లక్షల విలువ కలిగినవి శ్రీ గోదాదేవి రంగనాయకుల పంచలోహ విగ్రహములు, బంగారు పుస్తెలను విజయవాడ ప్రాంతానికి చెందిన ఎన్నారై మద్దినేని ఫణికుమారి–మురళీకృష్ణ దంపతులు ఆలయానికి బహుకరించారు. ఇట్టి కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కల్యాణోత్సవంలో పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఉర్సుగుట్టపై నెలవై ఉన్న గోదా రంగనాయక స్వామి దేవాలయం ఎంతో పురాతనమైనదని, పూజలు నోచుకోని పరిస్థితులలో అయ్యగార్లు ముందుకు వచ్చి పూజలు నిర్వహిస్తున్నారన్నారు. అభివృద్ధి లేక అయ్యగార్లతోపాటు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మురళీధర్ రావు దృష్టికి తీసుకుపోగా రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి ఉర్సు గుట్టపై ఆధునీకరణతో కూడిన విద్యుత్ దీపములు ఏర్పాటుకు రూ.25 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ పనులు త్వరలో కార్యరూపం దాల్చనున్నట్లు కార్పొరేటర్ మరుపల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బత్తిని నవీన్, ధర్మకర్త వంగరి సురేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు తౌటు జ్ఞానదేవ్, అడ్డగట్ల జ్ఞానేశ్వర్, అంకం లక్ష్మీనారాయణ, గట్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.










# భక్తుల విశ్వాసానికి ప్రతీక

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండా :** భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండ సురేఖకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. భోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, బ్రహ్మోత్సవాలు, జాతరల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ..**

భోగి పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. భోగి పండుగ పాత కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, వర్ధన్నపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.









## పాఠకులకు, ప్రకటనకర్తలకు అందరికీ భోగి, సంక్రాంతి మరియు కనుమ పండుగల శుభాకాంక్షలు..

























EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com